

డ్రైనేజీలో సిల్ట్‌ను తీయిస్తున్న చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

# పబ్లిక్ టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచాలి

- డ్రైనేజీల్లో చెత్తను తొలగించాలి
- మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

మహబూబాబాద్, డిసెంబర్ 12: ప్రతి ఒక్కరూ పబ్లిక్ టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పాఠశాలల విద్యార్థులతో మున్సిపల్ అధికారులు నిర్వహించిన క్లీన్ టాయిలెట్స్ క్యాంపెయిన్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే వారి కోసం ప్రధాన కూడళ్లలో మున్సిపాలిటీ ద్వారా పబ్లిక్ టాయిలెట్లను నిర్మించామని, వాటిని వాడుకునే వారు శుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం మదర్‌థెరిసా సెంటర్ నుంచి వివేకానందా సెంటర్ వరకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది చేపట్టిన డ్రైనేజీ పనులను చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి పరిశీలించారు. ప్రతి డ్రైనేజీలో సిల్ట్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎండీ ఫరీద్, డీఈ ఉపేందర్, ఫ్లోర్‌లీడర్ చిట్యాల జనార్దన్, 11వ వార్డు కౌన్సిలర్ బాలూనాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి, ఈఈ క్రాంతి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నాలుగు విద్యుత్ మోటర్లు చోరీ



మన్నెగూడెంలో చోరీ అయిన విద్యుత్ మోటర్

డోర్నకల్, డిసెంబర్ 12: నాలుగు విద్యుత్ మోటర్లు చోరీ జరిగిన ఘటన సీరోలు మండలం మన్నెగూడెంలో సోమవారం రాత్రి జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్నెగూడేనికి చెందిన రైతులు గుగులోత్ భాస్కర్, ఊరుగొండ వెంకన్న, గుగులోత్ కిషన్, రావిగూడేనికి చెందిన వీరన్న వ్యవసాయ క్షేత్రంలోని బావి వద్ద ఉన్న విద్యుత్ మోటర్ల బాడీలను తీసి గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి చోరీ చేశారు. బాధిత రైతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# భాషా సామర్థ్యాలతో భావ ప్రకటన సాధ్యం

- సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలి
- విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలి
- జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు
- పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ
- ఉపాధ్యాయులతో సమావేశాలు



నెల్లికుదురు: సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రామారావు

నెల్లికుదురు, డిసెంబర్ 12: విద్యార్థుల్లో భాషా సామర్థ్యాలను పెంపొందించినప్పుడే భావ ప్రకటన సాధ్యమవుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయి కాంప్లెక్ట్ సమావేశాలను మంగళవారం ఆయన సందర్శించారు. కాంప్లెక్స్ సమావేశాల ఎజెండా అంశాలేంటి? ఎంతమంది సమావేశానికి హాజరయ్యారు..? ఉన్నత, ఎఫ్ఎల్ఎన్‌ల అమలుతో విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతున్నదా..? ఎఫ్ఎల్ఎన్‌తో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందాయా..? తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదిలో వినూత్న పద్ధతిలో బోధించినప్పుడు విద్యార్థులకు పాఠ్యాంశాలపై అవగాహన పెంపొందుతుందన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాట వేసేవారు ఉపాధ్యాయులేనని తెలిపారు. గత సంవత్సరం నుంచి పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ అమలు చేస్తుడడంతో ప్రాథమికస్థాయి విద్యార్థుల్లో రాయడం, చదవడం, లెక్కలు చేయడం వంటి నైపుణ్యాలు, విజ్ఞానం పెంపొందాయన్నారు. దీన్ని ఆధారంగా తీసుకొని ఉన్నత పాఠశాలల్లో సైతం ఈ కార్యక్రమాన్ని ఉన్నతి పేరుతో అమలు చేస్తున్నారన్నారు. విద్యార్థుల్లో విషయ నైపుణ్యాలతో పాటు భాష నైపుణ్యాలను పెంపొందించాలని చెప్పారు. ప్రతి పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నెల్లికుదురు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం జీవన్‌కుమార్, కోర్సు డైరెక్టర్‌గా సీహెచ్ పవన్‌కుమార్, ఆర్పీ రవికుమార్, డీ శ్రీనివాస్, ఎం రమేశ్, బొమ్మరాతి సాయిలు, సీఆర్పీ బీ వీరస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అభ్యసన సామర్థ్యాలను పెంచాలి

కురవి: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో రామారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మహబూబాబాద్, కురవి, సీరోలు మండలాల కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. చదువులో వెనుకబడిన విద్యార్థులు భాషపై పట్టు సాధిస్తేనే భాషేతర విషయాలు నేర్చుకునేందుకు వీలవుతుందన్నారు. విద్యార్థులకు చదవడం, రాయడం నేర్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ విద్యలో రాణించేలా తయారు చేసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. సమావేశంలో ఎంఎన్‌వోలు బాలాజీ, లచ్చిరాం, డీఆర్‌జీ ప్రసాద్, హరీశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పట్టుదలతో చదవాలి

కేసముద్రం: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డీఈవో రామారావు అన్నారు. మండలంలోని తిమ్మంపేటలో ఉన్న కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో 10/10 జీపీఏ సాధించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, మెనూ తప్పక పాటించాలని నిర్వాహకులకు సూచించారు. పాఠశాలలో చిన్నచిన్న రిపేర్ పనులను చేయించాలని సంబంధిత శాఖ అధికారులకు తెలిపారు. ఆయన వెంట ఏఈ రాజ్‌కుమార్, స్పెషల్ ఆఫీసర్ నీలిమా తదితరులు ఉన్నారు.

# అయ్యప్ప మాలధారులకు అన్నదానం



కేసముద్రం: అన్నదానం చేస్తున్న మహేందర్‌రెడ్డి దంపతులు

కేసముద్రం: మండలంలోని ధర్మశాస్త్ర దేవాలయంలో అయ్యప్ప మాలధారులకు కేసముద్రం సింగిల్‌విండో వైస్ చైర్మన్, అమీనాపురం ఎంపీటీసీ అంబటి మహేందర్‌రెడ్డి-లక్ష్మి దంపతులు తమ కుమారుడు శ్రీనేశ్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు పోలేపల్లి యాకూబ్‌రెడ్డి, కూరెళ్లి సతీశ్, ఎల్లగౌడ్, ఆరెందుల కిరణ్ ఉన్నారు.

## కేసముద్రంలో అన్నదానం

గార్ల, డిసెంబర్ 12: మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో ధర్మశాస్త్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం అయ్యప్ప మాలధారులకు మండ శ్రీనుగౌడ్ అన్నదానం చేశారు. కార్యక్రమంలో కట్టా రమేశ్, తోడేటి విజయరాముడు, కొండల్ రెడ్డి, భిక్షపతి, నారాయణ, వెంకటేశ్వర్లు, రజిని తదితరులు పాల్గొన్నారు.

# వారధి వచ్చే.. కష్టాలు తీర్చే..

- పీఎంజీఎస్‌వై నిధులు రూ.2.12కోట్లతో వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామాల ప్రజలు



వెన్నారం శివారులో గంగమ్మ గుడి వద్ద కల్వర్టుపై నిర్మించిన హైలెవల్ బ్రిడ్జి



గతంలో లోలెవల్ బ్రిడ్జిపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు (ఫైల్)

డోర్నకల్, డిసెంబర్ 12: వర్షాలు కురిసినప్పుడల్లా వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఉయ్యాలవాడ, వెన్నారం, రాముతండా, తోడేళ్లగూడెం, ముల్కలపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయేవి. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. సమైక్య పాలనలో వెన్నారం ప్రజలు గంగమ్మ గుడి వద్ద లో లెవల్ కల్వర్టుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని విన్నవించినా ఫలితం లేకుండాపోయింది. వెన్నారం వాగుపై లోలెవల్ కల్వర్టు ఉండడం వల్ల వర్షాకాలం వచ్చిందటే చాలు రెండు, మూడు రోజులదాకా రోడ్డు దాటనిచ్చేవి కాదు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు వారి దారి కష్టాలు తీర్చలేదు. స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారి సమస్యలకు పరిష్కారం లభించింది. ఎన్నో ఏళ్ల ఆయా గ్రామాల ప్రజల కలను మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్ సాకారం చేశారు. వెన్నారం శివారులో గంగమ్మ గుడి వద్ద లోలెవల్ కాల్వర్టుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి పీఎంజీఎస్‌వై నిధులు రూ.2.12 కోట్లు కేటాయించారు. 54.64 మీటర్ల పొడవు, 5 ఖానాలతో అధునాతన హంగులతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. ఇటీవల హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. దీంతో దశాబ్దాల నాటి సమస్యకు మోక్షం లభించింది. ప్రజలు, వాహనాల రాకపోకలు సాఫీగా జరుగుతున్నాయి. హై లెవల్ బ్రిడ్జి నిర్మాణంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## దారి కష్టాలు తీరాయి



వానకాలం వచ్చిందంటే లోలెవల్ కాల్వర్టుపై వరద నీరు ఉధృతంగా ప్రవహించేది. దీంతో ప్రజలు, వాహనాలు రాకపోకలు రెండు, మూడు రోజులు నిలిచిపోయేవి. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇబ్బంది పడేవారు. ఎన్నో దశాబ్దాల సమస్య హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం. ఈ బ్రిడ్జి పూర్తి కావడం సంతోషంగా ఉంది. మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్‌కు కృతజ్ఞతలు.

–రెడ్డిమల్ల వెంకన్న, వెన్నారం

# 'కస్తూర్బా'లో పెండింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలి

ఈఈ నరేందర్‌రెడ్డి, డీఈ అరుణ్‌కుమార్

తొర్రూరు, డిసెంబర్ 12: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న పనులను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఈఈ నరేందర్‌రెడ్డి, డీఈ అరుణ్‌కుమార్ అన్నారు. మంగళవారం పాఠశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులును జీసీడీవో విజయకుమారితో కలిసి ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించారు. పనుల తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. బాలికలకు అసౌకర్యం కలుగకుండా పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాల అధికారుల సూచనల మేరకు సమస్యలను గుర్తించి పనులు వెంటనే పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. జీసీడీవో విజయకుమారి మాట్లాడుతూ.. పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడంతో పాటు వృత్తి విద్యపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. యోగా, క్రీడా శిక్షణతో పాటు కరాటే వంటి ఆత్మరక్షణ విద్యలు నేర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి బీ శైలజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పనుల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు, జీసీడీవో విజయకుమారి